

మామిడి కొనుగోలులో బాలారిష్టాలు



- కిలోకి రూ.8 ఇచ్చేందుకు ముందుకొచ్చిన 5 ఫ్యాక్టరీలు
- రూ.7 ఇస్తున్న మిగిలిన యాజమాన్యాలు
- మరో నాలుగు రోజుల్లో రూపాయి పెంచే అవకాశం

మామిడి రైతుకు మద్దతు ధరను పటిష్ఠంగా అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇందులో భాగంగా సీఎంవో అధికారులు రెగ్యులర్‌గా కలెక్టర్ సుమిత్‌కుమార్, జిల్లాలోని ఇతర అధికారులతో మాట్లాడుతూ.. తగిన సూచనలిస్తూనే ఉన్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

'కృష్ణగిరి' కాయలు జిల్లాలోకి రాకుండా నిఘా

కృష్ణగిరిలోని ఫ్యాక్టరీల్లో కిలో మామిడి రూ.5 నుంచి రూ.6 మధ్యలో అమ్ముడుబోతోంది. మన ప్రభుత్వం రూ.4 సబ్సిడీని ప్రకటించిన నేపథ్యంలో అక్కడి కలెక్టర్ కూడా తమిళనాడు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయినా అక్కడి ప్రభుత్వం నుంచి స్పందన లేదు. దీంతో అక్కడి రైతులు మన జిల్లాకు మామిడి కాయల్ని తెచ్చేస్తున్నారు. ఇలా అయితే మన రైతులకు అన్యాయం జరుగుతుంది. తమిళనాడు నుంచి మామిడి జిల్లాలోకి రాకుండా సరిహద్దు చెక్‌పోస్టుల్లో నిఘా పెంచాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఇటీవల అధికారులకు ఆదేశించారు. ఒకవేళ తమిళనాడు ప్రభుత్వం కనీసం రూ.1 సబ్సిడీ ఇచ్చినా, అక్కడి రైతులు మన జిల్లాకు కాయల్ని తేవడం ఆపేస్తారు.

10 నుంచి అన్ని ఫ్యాక్టరీల్లో రూ.8

జిల్లాలో మొత్తం 35 ఫ్యాక్టరీలు, 38 ర్యాంపులున్నాయి. ప్రస్తుతానికి మద్దతు ధర ఇచ్చేందుకు ఐదు ఫ్యాక్టరీలవారు కలెక్టర్ ఎదుట అంగీకరించారు. మిగిలినవారు రూ.7 ఇస్తుండగా.. వారు కూడా రూ.8 ఇచ్చేందుకు సంప్రదింపులు జరుగుతున్నాయి. మరో నాలుగు రోజుల్లో అన్ని ఫ్యాక్టరీల్లోనూ ఈ మద్దతు అమలయ్యేలా అధికారులు ప్లాన్ చేస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లాలో మద్దతు ధర రూ.12 అమలు కావాలని సీఎం స్పెషల్ సెక్రటరీ రాజమౌళి ఆదేశించారు. ఈ విషయంగా ఆయన చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లతో శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన విషయం తెలిసిందే.ఈనెల 10 నుంచి జిల్లాలోని అన్ని ఫ్యాక్టరీలు తెరచుకునేలా, మద్దతు ధరను ఇచ్చేలా అధికారులు సిద్ధం చేశారు.

40 వేల టన్నుల పల్ప్ నిల్వలు

ఒకప్పటిలా మామిడి ఉత్పత్తులను ప్రజలు ఇబ్బడిముబ్బడిగా ఉపయోగించడం లేదు. వాటి అమ్మకాలు కూడా బాగా తగ్గిపోయాయి. దీంతో ఫ్యాక్టరీలు తయారు చేస్తున్న పల్ప్ ఎగుమతి కావడం లేదు. 2023, 2024 సంవత్సరాల్లో తయారుచేసిన పల్ప్ జిల్లాలోని ఫ్యాక్టరీల్లో సుమారు 40వేల టన్నులు అలాగే ఉండిపోయిందంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఫ్యాక్టరీలకు కూడా.. పల్ప్ కొనుగోలు చేసిన కంపెనీల నుంచి పెద్దఎత్తున బిల్లులు పెండింగులో ఉన్నాయి. దీంతో పల్ప్ ఫ్యాక్టరీలు కూడా మామిడి కాయలను కొనుగోలు చేయాలంటే ఆలోచిస్తున్నాయి.

నేటినుంచి ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్ద అధికారుల బృందాలు

జిల్లాలోని ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్ద విడతల వారీగా పనిచేయడానికి ఇప్పటికే ఉద్యోగుల్ని నియమించారు. వీఆర్వో, అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు బృందంగా ఏర్పడి రైతుల వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. రోజూ స్థానిక తహసీల్దార్ పర్యవేక్షణ చేయాలి. సోమవారం నుంచి ఆయా ప్రాంతాల్లో ఉద్యోగుల బృందాలు పనిచేయనున్నాయి.

12నుంచి పల్ప్ ఫ్యాక్టరీలు పూర్తిస్థాయిలో

క్రషింగ్ మొదలుపెట్టాలి

- లేదంటే రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుంది
- మామిడి ధరల స్థిరీకరణ కమిటీ హెచ్చరిక

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పల్ప్ ఫ్యాక్టరీలు ఈనెల 12వ తేదీనుంచి పూర్తిస్థాయిలో క్రషింగ్ మొదలుపెట్టకుంటే రైతుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని మామిడి ధరల స్థిరీకరణ కమిటీ హెచ్చరించింది. ఆదివారం చిత్తూరులో కమిటీ సమావేశం రైతు త్యాగరాజరెడ్డి అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వం తోతాపురి కిలోకు రూ.4 ప్రోత్సాహకం అందజేస్తున్న తరుణంలో రైతులకు రూ.12 గిట్టుబాటు ధర చెల్లించాలని కమిటీ పునరుద్ఘాటించింది. కన్వీనర్లు ఆనంద నాయుడు, టి.జనార్దన్ తదితరులు మాట్లాడుతూ.. తోతాపురి మామిడి పక్వానికి వచ్చినా పొరుగురాష్ట్రాల నుంచి చౌకగా పొందేందుకోసం పల్ప్ ఫ్యాక్టరీలవారు ఇప్పటికీ క్రషింగ్ మొదలుపెట్టలేదని విమర్శించారు. పొరుగు రాష్ట్రాల నుంచి కాయలు రాకుండా రైతులు సైతం ఎక్కడికక్కడ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లా యంత్రాంగం కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలు పాటించని ఫ్యాక్టరీల లైసెన్సులు రద్దు చేయాలన్నారు. రైతు నాయకులు హరిబాబు చౌదరి,భారతి తదితరులు మాట్లాడుతూ ప్రతి ఫ్యాక్టరీ ధరల పట్టిక ప్రదర్శించాలన్నారు. ఫ్యాక్టరీకి తెచ్చిన కాయలను మూడు గంటల్లోగా అన్‌లోడింగ్ చేసేలా చూడాలని కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు మామిడి రైతుల తరఫున వినతిపత్రం అందజేయాలని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. గుణశేఖర్‌రెడ్డి, సంజీవిరెడ్డి, హరిబాబు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



చిత్తూరులో తెలుగు మహిళల నిరసన

'అమరావతి' మహిళలను అవమానిస్తారా?

- సాక్షి దినపత్రిక, చానల్ ఎండీ భారతిరెడ్డి క్షమాపణ చెప్పాల్సిందే
- భగ్గుమన్న తెలుగు మహిళలు

చిత్తూరు సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని మహిళలను అవమానిస్తారా అంటూ జిల్లా వ్యాప్తంగా తెలుగు మహిళలు ఆదివారం భగ్గుమన్నారు. సాక్షి దినపత్రిక, చానల్ ఎండీ భారతి రెడ్డి మహిళలకు క్షమాపణ చెప్పాల్సిందేనని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు చిత్తూరులోని సాక్షి కార్యాలయం ఎదుట చిత్తూరు పార్లమెంటు తెలుగు మహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కొమ్మినేని శ్రీనివాసరావు (కేఎస్ఆర్), జర్నలిస్టు, విశ్లేషకుడు కృష్ణంరాజు చిత్రపటాలను దహనం చేశారు. అలాగే సాక్షి పత్రికను అబద్ధాల వైసీపీ పత్రిక అంటూ రోడ్డుపై తగలబెట్టారు. కేఎస్ఆర్, కృష్ణంరాజుతో పాటు భారతిరెడ్డి క్షమాపణలు చెప్పాలని నినాదాలు చేశారు. అరుణ మాట్లాడుతూ అమరావతిని వేశ్యల రాజధాని అని మాట్లాడిన కృష్ణంరాజును మహిళలు క్షమించేది లేదన్నారు. సాక్షి చానల్ మూసేవరకు మరో ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు. చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత మాట్లాడుతూ,సీఎం చంద్రబాబు.. అమరావతిని దేవతల రాజధాని అంటూ మహిళలను గౌరవిస్తుంటే, సాక్షి చానల్ డిబేట్‌లో వేశ్యల రాజధాని అనడం రాష్ట్ర మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని మండిపడ్డారు. మహిళలను అవమానించిన వారెందరో కాలగర్భంలో కలిసిపోయారని గుర్తుచేశారు. అనంతరం కేఎస్ఆర్, కృష్ణంరాజు, భారతిరెడ్డిలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ చిత్తూరు డీఎస్పీ సాయినాథ్‌కు వినతిపత్రం సమర్పించారు.తెలుగు మహిళలు సీఎం విజయ,హేమలత, వరలక్ష్మి, రాణి, నాగలక్ష్మి, ఉదయ, అను, భువనేశ్వరి పాల్గొన్నారు.

4 మండలాల్లో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో నాలుగు మండలాల్లో తేలికపాటి వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా.. గుడిపాలలో 10, చిత్తూరులో 4.8, యాదమరిలో 4.2, పెద్దపంజాణిలో ఒక మి.మీ వర్షం కురిసింది.

'ఏపీ ఈఏపీ సెట్'లో జిల్లావాసికి 7వ ర్యాంకు



తల్లిదండ్రులతో మునిదీప్ రెడ్డి

చిత్తూరు సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో సదుం మండలం గొడ్లవారిపల్లెకి చెందిన డి.మునిదీప్ రెడ్డికి ఇంజనీరింగ్ విభాగంలో 7వ ర్యాంకు సాధించాడు. జిల్లాలో ఇంజనీరింగ్ విభాగంలో 6,133మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 5,802 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 3,943 మంది అర్హత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మా విభాగంలో 1,746 మంది దరఖాస్తు చేసుకోగా, 1,585 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 1,423 మంది విద్యార్థులు అర్హత సాధించారు. కాగా, ఏడో ర్యాంకు సాధించిన మునిదీప్‌రెడ్డికి జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 345వ ర్యాంకు వచ్చింది. ఏఐ చదవాలన్నది తన లక్ష్యమని చెప్పాడు. ఇతని తండ్రి గిరిప్రసాద్‌రెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తుంటే, తల్లి డాక్టర్ అమరావతి.. తిరుపతిలోని ఆచార్య ఎన్జీ రంగా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

నేడు 'షైనింగ్ స్టార్' అవార్డుల ప్రదానోత్సవం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ప్రతిభాపాటవాలను పెంపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన షైనింగ్ స్టార్ అవార్డుల కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌తోపాటు ఎమ్మెల్యేలు పాల్గొంటారని పేర్కొన్నారు.జిల్లాలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు పొందిన 190 మంది విద్యార్థులకు, ఇంటర్‌లో 33 మంది విద్యార్థులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అవార్డులు అందజేస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. ఒక్కో విద్యార్థికి ప్రశంసాపత్రం,మెడల్‌తోపాటు రూ.20వేల నగదు బహుమతి అందజేయనున్నట్లు వివరించారు. ఎంపికైన విద్యార్థులు తమ ఐడీ కార్డు లేదా ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలని కోరారు. విద్యార్థితోపాటు తల్లిదండ్రుల్లో ఒకరిని ఆధార్ కార్డుతో కార్యక్రమానికి అనుమతిస్తారన్నారు.

హాస్టళ్లు కళకళ

- విద్యార్థులకు స్వాగతం పలుకుతున్న సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు
- రూ.12 కోట్లతో మరమ్మతులు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం



ఎల్లంకివారిపల్లెలోని వసతి గృహం



బాగుపడ్డ మరుగుదొడ్లు



నూతనంగా అమర్చిన బేసిన్

వైసీపీ ప్రభుత్వ హయాంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలను గాలికొదిలేశారు. ఏ భవనం చూసినా విరిగిన కిటికీలు.. దుర్గంధం వెదజల్లే మరుగుదొడ్లు.. పెచ్చులూడే స్లాబ్‌లే దర్శనమిచ్చేవి. నీటి వసతి కూడా అంతంత మాత్రంగానే ఉండేది. దీనివల్ల ఇక్కడుండే ఎస్సీ విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన ఆరు నెలల్లోనే వసతి గృహాల్లోని సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టారు. ప్రస్తుతం వసతి గృహాలన్నీ కళకళలాడుతున్నాయి.

జిల్లాలో 57 ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో ఆరు ప్రైవేటు భవనాల్లో నడుస్తుండగా, మూడు భవనాలు బాగానే ఉన్నాయి. మిగిలిన 48 వసతి గృహాల్లో మరమ్మతులకు జిల్లా యంత్రాంగం నివేదిక పంపగా రాష్ట్ర ప్రభుత్వం రూ.11.83 కోట్లను విడుదల చేసింది. దాంతోపాటు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.48లక్షలను మంజూరు చేశారు. ఈ ఏడాది జనవరిలోనే పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, సోషల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్, సమగ్ర శిక్ష (ఎస్ఎస్) శాఖలకు పనులను కలెక్టర్ సుమిత్‌కుమార్ అప్పగించారు. ఒక్కో శాఖ.. ఒక్కో నియోజకవర్గంలోని వసతి గృహాల బాధ్యత తీసుకోవాలని, పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. మరోవైపు పనులు కూడా వేగంగా జరగడంతో కొన్నిచోట్ల వందశాతం, మరికొన్ని చోట్ల 90శాతం వరకు పూర్తయ్యాయి.

ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఈనెల 12వ తేదీ నుంచి పాఠశాలలతో పాటు వసతి గృహాలు కూడా తెరచుకోనున్నాయి. అన్ని వసతులు కల్పించడంతో ఈ ఏడాది వసతి గృహాల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని సాంఘిక సంక్షేమశాఖ అధికారులు చెబుతున్నారు.

ఏయే పనులు చేశారంటే..

మరుగుదొడ్లు, కిటికీలు, ఫ్లోరింగ్, శ్లాబ్, తలుపులు, వాటర్ పైపులైన్లు, డ్రైనేజీ వ్యవస్థను బాగుచేయడంతోపాటు కిటికీలకు దోమల మెష్, లైటింగ్, ఫ్యాన్ల ఏర్పాటు, సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్, రెండుమూడు చోట్ల ప్రహరీల నిర్మాణాన్ని చేపట్టారు. దాదాపు అన్ని భవనాలకు పెయింటింగ్ చేశారు.

నాణ్యమైన భోజనం అందించే దిశగా..

గత ప్రభుత్వ హయాంలో ఒక్కసారి మాత్రమే కాస్మెటిక్, డైట్ చార్జీలను పెంచింది. పెంచిన మేరకు నిధులను విడుదల చేయకపోవడంతో పాత డైట్ చార్జీలతోనే విద్యార్థులకు మెనూను అమలు చేశారు. దీనివల్ల చాలీచాలనీ ఆహారాన్ని విద్యార్థులకు పెట్టేవారు. ఈ కారణంగా ఒక్కో హాస్టల్‌లో వంద మంది విద్యార్థులకు 20 నుంచి 50 వరకే పరిమితమయ్యారు. ఈ విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. వసతి గృహాల్లో నాణ్యమైన భోజనాన్ని అందించే దిశగా చర్యలు చేపట్టింది.

- చిత్తూరు అర్బన్, ఆంధ్రజ్యోతి

నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి అర్జీలను తీసుకుంటారని తెలిపారు. డివిజన్, మండల స్థాయిల్లోనూ అధికారులు పీజీఆర్ఎస్ నిర్వహించాలని సూచించారు.

- జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. బాధితులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వల్పంగా పెరిగిన టమోటా ధరలు

సోమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు స్వల్పంగా పెరగడంతో పలువురు రైతులు తమ తోటల్లోని కాయలను కోతలు చేస్తున్నారు. ఆదివారం పుంగనూరు, పలమనేరు, కోలారు మార్కెట్లలో 15 కిలోల బాక్సు రూ.150 నుంచి రూ.230 వరకు చేరుకుంది. గత డిసెంబరు నుంచి టమోటాలకు ధరల్లేక రైతులు కోతలు చేయలేక పశువులకు మేతగా వేశారు. 15 కిలోల బాక్సు రూ.70 లోపే పలికింది. సోమల, చౌడేపల్లె, కందూరు, పుంగనూరు, పలమనేరు తదితర ప్రాంతాల్లో వేల ఎకరాల్లో టమోటా సాగు చేపట్టారు. మార్చి నెలలో నాటిన టమోటా తోటల్లో కాయలు మార్కెట్‌కు వస్తున్నాయి. ఏప్రిల్ మొదటి వారం నాటిన టమోటా తోటల్లో కోతలకు సిద్ధంగా ఉన్నాయి. జనవరి, ఫిబ్రవరి నెలల్లో నాటిన రైతులు తీవ్రంగా నష్టపోయారు.

చిత్తూరుకు నేడు షర్మిల రాక

చిత్తూరు రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం చిత్తూరుకు రానున్నారు. నగర శివారులో ఉన్న బ్యాన్స్ హోటల్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని.. నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని జిల్లా నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.



భక్తులతో కాణిపాకం కిటకిట

ఐరాల (కాణిపాకం), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. వేసవి సెలవులు ముగుస్తుండటంతో ఉదయం నుంచి స్వామి దర్శనానికి వేలాదిగా తరలివచ్చారు. క్యూలైన్లు ఆలయం వెలుపలకు వ్యాపించాయి. క్యూలైన్లలో భక్తుల మధ్య తొక్కిసలాట జరగకుండా ఈవో పెంచలకిషోర్ పర్యవేక్షించారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రవి, బాలాజీ నాయుడు సహకరించారు.

ఈత కోసం వెళ్లి కర్ణాటక యువకుడి మృతి



మురళి మృతదేహం

బంగారుపాళ్యం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో ఈత కెళ్లి ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. కర్ణాటక రాష్ట్రం ముళబాగిళ్ తాలూకా చాపర్లపల్లె గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు మురళి తన స్నేహితులైన అమర, అజయ్, విశ్వనాథ్, విజయ్, రాజశేఖర్, గణేష్, తేజలతో కలిసి బంగారుపాళ్యంలోని మామిడి కాయల మార్కెట్‌లోని 40వ నెంబరు మండీలో కూలీలుగా పని చేస్తున్నారు. వీరంతా ఆదివారం బంగారుపాళ్యంలోని తగ్గువారిపల్లె సమీపంలోని రామన్నబావిలో ఈత కోసం వెళ్లారు. మురళి ఈత కొడుతూ నీటిలో మునిగిపోయాడు. ఎంతకూ బయటకు రాకపోవడంతో స్నేహితులు బావిలో గాలించారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు పలమనేరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది బావిలో గాలించగా మెట్లకింద బురదలో మురళి (23) కూరుకుపోయి చనిపోయి ఉండడంతో అతికష్టంపై మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు.

రైలునుంచి జారిపడి యువకుడి మృతి



కుప్పం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం మధ్యాహ్నం రైలు నుంచి ఓ యువకుడు (30) జారిపడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన యువకుడిని చికిత్స నిమిత్తం కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నీలిరంగు చొక్కా, జీన్స్ ప్యాంటు వేసుకున్న ఈ యువకుడిని ఎవరైనా గుర్తిస్తే రైల్వే పోలీసులకు ఫోన్ నెంబరు 9494228854 కు సమాచారం అందించాలని కోరారు.

పంటలపై మళ్లీ మొదలైన గజదాడులు

● కల్లూరు సమీపంలోని అడవిలో ఏనుగుల గుంపు తిష్ట



కల్లూరు వద్ద మామిడి చెట్టును ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు

కల్లూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని పంటలపై మళ్లీ గజదాడులు మొదలయ్యాయి. మూడేళ్లుగా వీటి బారి నుంచి రైతులు తప్పించుకోలేక తీవ్రంగా నష్టపోతున్నారు. మండలాన్ని వీడాయని రైతులు ఊపిరి పీల్చుకునేలోపే తిరిగొస్తూ పంటలను ధ్వంసం చేస్తున్నాయి. పశ్చిమ విభాగం అటవీ ప్రాంతం నుంచి శనివారం రాత్రి బయల్దేరిన ఏనుగుల గుంపు ముచ్చుగుట్ట మార్గంలో లక్ష్మీ నారాయణ, శేషాద్రి, కృష్ణయ్య, బాలరాజు, మున్ని, కృష్ణమూర్తి తదితర రైతుల మామిడితోటల్లో కాయలను నేలరాల్చాయి. అనంతరం కల్లూరు సమీపంలోని ఎద్దులవారిపల్లె వద్దకు చేరుకుని.. కల్లూరులోని రైతు టీఎస్ ఖాదర్‌బాషా మామిడితోటలోకి ప్రవేశించాయి. కాయలను నేలరాల్చడంతోపాటు 20 ఏళ్ల చెట్లను విరిచేశాయి. అక్కడి నుంచి కల్లూరు- చిత్తూరు హైవే వద్దకు చేరుకుని ఎర్రకాలువ మార్గంలో మళ్లీ ముచ్చుగుట్టకు చేరుకుని పశ్చిమ విభాగం అటవీ ప్రాంతంలో తిష్టవేశాయి. సుమారు ఏడు ఏనుగులు గుంపుగా వచ్చి పంటలను నాశనం చేసినట్లు రైతులు తెలిపారు. కల్లూరు సమీపంలోని అడవిలో ఏనుగుల గుంపు తిష్ట వేశాయని, సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐరాల సెక్షన్ ఎఫ్‌బీవో శ్రీదేవి హెచ్చరించారు.

గరిమెళ్ల రాధ మృతి



తిరుపతి, జూన్8 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ సంగీత కళాకారుడు, టీటీడీ ఆస్థాన విద్వాంసుడు దివంగత గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ సతీమణి రాధ ఆదివారం మృతి చెందారు. మూడు నెలల క్రితం గరిమెళ్ల అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. అనతికాలంలోనే ఆమె కన్నుమూయడంతో గరిమెళ్ల కుటుంబ సభ్యులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

పురుగుల మందు తాగిన యువకుడి మృతి

కల్లూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పులిచెర్ల మండలం కమ్మపల్లె పంచాయతీ కువరపల్లెకి చెందిన లక్ష్మీదేవి కుమారుడు రేవంత్ (21) ఇంటర్ వరకు చదువుకొని కూలీ పనులు చేసుకుంటున్నాడు. వ్యసనాలకు దూరంగా ఉండాలని ఈనెల ఆరో తేదీన తల్లి మందలించింది. మనస్తాపానికి గురైన యువకుడు అదేరోజు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గ్రామానికి సమీపంలోని పులిచెర్ల రైల్వే బ్రిడ్జి వద్ద ఉన్న రెడ్డిచెరువు సమీపంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు గుర్తించి పులిచెర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడినుంచి మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఏఎస్ఐ గజేంద్ర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చిన్న శేష, హంస వాహనాలపై

ప్రసన్న వెంకన్న విహారం





చిన్న శేష వాహనంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు. హంస వాహనంపై ప్రసన్న వెంకటేశ్వరుడు

వడమాలపేట,జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజు ఆదివారం ప్రసన్న వేంకటేశ్వరుడు సాయంత్రం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనాలపై మాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. సాయంత్రం ప్రసన్న వేంకటేశ్వరుడు సర్వాలంకారం భుషితుడై ఐదు తలల చిన్న శేషవాహనంపై మోహనకృష్ణుడి అలంకారంలో మేళతాలాలు, మంగళ వాయిద్యాలు నడుమ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులపై వరాల జల్లు కురిపించారు. సాయంత్రం భక్తుల గోవిందనామ స్మరణల నడుమ శ్రీవారి ఊంజల సేవ నిర్వహించారు. రాత్రి స్వామి వారు హంస వాహనారూఢుడై సరస్వతీదేవి అలంకారంతో భక్తుల గోవిందనామ స్మరణల నడుమ మాడవీధుల్లో ఊరేగారు. భక్తులు నారికేళ కర్పూర నీరాజనాలు సమర్పించారు. అప్పలాయగుంట మాడవీధుల్లో ఒకరు కాలం చెందడంతో బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు కార్యక్రమాలు ఆలస్యంగా ప్రారంభించారు. మధ్యాహ్నం తరువాత మాడ వీధులు, ఆలయంలో సంపూర్ణ సంప్రోక్షణ, హోమాదికాలు నిర్వహించి యాథాతథంగా ఊంజల సేవ, వాహన సేవలు నిర్వహించారు. ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, కంకణ భట్టార్ తిప్పయ్యాచార్యులు పాల్గొన్నారు.

నేటి వాహన సేవలు

అప్పలాయగుంటలో మూడోరోజు సోమవారం ఉదయం 8.00 నుంచి 9.00గంటల వరకు సింహ వాహన సేవ, సాయంత్రం 5.00 నుంచి 5.30 గంటల వరకు శ్రీవారి ఊంజల సేవ, రాత్రి 7.00 నుంచి 8.00 వరకు ముత్యపు పందిరి వాహనంపై శ్రీవారు మాడవీధుల్లో విహరించనున్నారు.

భక్తజనసంద్రం.. ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. వారాంతపు, వేసవి సెలవులు రావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచీ భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28వేల మంది దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు.

కుప్పం గ్రామ దేవతల గుడులకు

మంచిరోజులు

రూ.33.67 కోట్ల టీటీడీ నిధులతో పునరుద్ధరణ పనులు



కుప్పం మండలం బలమందకొట్టాలులో గంగమ్మ ఆలయాన్ని పరిశీలిస్తున్న టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం తదితరులు

కుప్పం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం అభివృద్ధిలో భాగంగా సీఎం చంద్రబాబు సూచన మేరకు నియోజకవర్గంలోని గ్రామదేవతల ఆలయాల పునరుద్ధరణకు టీటీడీ పూనుకుంది. ప్రస్తుతం టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం ఆధ్వర్యంలో నిపుణుల బృందం నియోజకవర్గంలోని ఆలయాలను సందర్శిస్తోంది. కుప్పం మండలంలోని బేటరాయస్వామి ఆలయం, శ్రీప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయం, గుడుపల్లె మండలంలోని మల్లప్ప కొండ, యామగానిపల్లెలోని ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఆలయం, శాంతిపురం మండలం రాళ్లబూదుగూరులోని అతి ప్రాచీనమైన కోదండరామస్వామి ఆలయం, రామకుప్పంలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలను స్థపతులు, ఇంజనీరింగ్ అధికారులున్న ఈ బృందం ఇప్పటికే సందర్శించింది. శనివారం, ఆదివారం ఈ బృందం పలు ఆలయాలు సందర్శించి చేయాల్సిన పనులపై అంచనాలు తయారు చేస్తోంది. నియోజకవర్గంలోని 141 గ్రామ దేవతల ఆలయాలను గుర్తించి, ఆ ఆలయాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాల్సిందిగా మే 19న టీటీడీ పాలకమండలితోపాటు, అధికార యంత్రాంగానికి బోర్డు సభ్యుడు శాంతారాం ప్రతిపాదనలు పంపారు. ఈ ఆలయాల పునరుద్ధరణ బాధ్యతను తీసుకోవడానికి టీటీడీ అంగీకరిస్తూ, ఇందుకోసం రూ.33.67 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించి, సాంకేతిక అనుమతులు కూడా జారీ చేసింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో దాదాపు ప్రతి పంచాయతీకి ఒక ఆలయం చొప్పున టీటీడీ పునరుద్ధరణ జాబితాలో ఉన్నాయి.

పునరుద్ధరణ జాబితాలోని ఆలయాలు

కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని వడ్డిపల్లెలోని ప్రసన్న ఊరి గంగమ్మ ఆలయం, బేవనలపల్లె తిమ్మరాయస్వామి ఆలయం, ఫిషర్‌మెన్ కాలనీలోని వినాయక ఆలయం, ఆజాద్ రోడ్డులోని నాగాలమ్మ ఆలయం, కమతమూరులోని రామభజన మందిరం, కుప్పం మండలం మోట్లచేనులోని తొట్లమాంబ దేవస్థానం, మల్లానూరులోని సామిడియమ్మ ఆలయం, కుంజేగానూరులోని శ్రీరాముల దేవస్థానం, బలమందకొట్టంలోని శ్రీతిరుపతి గంగమ్మ ఆలయం, గుడుపల్లె మండలం ఎ.కొత్తపల్లెలోని గంగమ్మ ఆలయం, బెగ్గిలపల్లెలోని మారెమ్మ ఆలయం, సంగనపల్లెలోని శ్రీరాముల దేవస్థానం, గుడుపల్లెలోని రాళ్లగంగమ్మ ఆలయం, రామకుప్పం మండలం బగలనత్తంలోని మారియమ్మ ఆలయం, ముద్దనపల్లెలోని ఓంశక్తి ఆలయం, ననియాలలోని వినాయక ఆలయం, లింగాపురంలోని తిమ్మరాయస్వామి ఆలయాలతోపాటు శాంతిపురం మండలంలోని ఆలయాలు కూడా టీటీడీ పునరుద్ధరణ జాబితాలో ఉన్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశంతో, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నంల సహకారంతో పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయని టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం తెలిపారు. వీరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

కాణిపాకంలో సామూహిక అక్షరాభ్యాసం







స్వామి ఉత్సవర్లను తీసుకొస్తున్న ఏఈవో రవీంద్రబాబు తదితరులు● అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు, వారి తల్లిదండ్రులు● చిన్నారులకు పలక, బలపాలు అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో ఆదివారం సామూహిక అక్షరాభ్యాసాన్ని ఆలయ ఈవో పెంచకిషోర్ వైభవంగా నిర్వహించారు. ఆస్థాన మండపంలో ఉదయం ఈవో చిన్నారులతో ఓనమాలు దిద్దించారు. ప్రధాన ఆలయం నుంచి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను వేడుకగా తీసుకొచ్చి ఆస్థాన మండపంలో కొలువు దీర్చారు. ఉత్సవ విగ్రహాలకు అర్చక, పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడే చిన్నారులకు ఈవో పలక, బలపం అందించి, అక్షరాలు దిద్దించారు. చిన్నారులకు, వారి తల్లిదండ్రులు ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు రవీంద్రబాబు, హరిమాధవరెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

బదిలీలు ప్రత్యక్ష పద్ధతిలోనే నిర్వహించాలి

● వెబ్ కౌన్సెలింగ్‌ను ఆమోదించేది లేదు ● డీఈవో కార్యాలయాన్ని ముట్టడించిన టీచర్లు



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

చిత్తూరు సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బదిలీలను ప్రత్యక్ష పద్ధతిలోనే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయులు ఆదివారం డీఈవో కార్యాలయాన్ని ముట్టడించారు. ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక చిత్తూరు జిల్లా స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘ నేతలు మాట్లాడుతూ.. గత నెల పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్ సమక్షంలో జరిగిన చర్చల సందర్భంగా సెంకడరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు మాన్యువల్‌గా కౌన్సెలింగ్, బదిలీలు చేపట్టడానికి అంగీకరించడం జరిగిందన్నారు. కానీ ఎస్జీటీలకు మళ్లీ వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని చెప్పడం ఇచ్చిన హామీని ఉల్లంఘించడమవుతుందన్నారు. అంతేకాక ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లకు ఇప్పటి వరకు జరిగిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో అనేక సాంకేతికపరమైన సమస్యలు తలెత్తడంతో చాలా మంది నష్టపోవడం జరిగిందని చెప్పారు. ఇలాంటివి పరిష్కరించక పోవడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర, జిల్లా నేతలు బాలాజీ, గిరి ప్రసాద్ రెడ్డి, జీవి రమణ, కణ్ణన్, చెంగల్రాయ మండడి, ముత్యాల రెడ్డి, సోమశేఖర్ నాయుడు, మణిగండన్, మదన్మోహన్ రెడ్డి, మోహన్, కిరణ్ కుమార్, ముక్తిర్ మహ్మద్, విజయభాస్కర్, నాగరాజ, సాబిరెడ్డి, వెంకటముని, మునీర్ అహ్మద్, సుధాకర్ రెడ్డి, దీనావతి, బాషా, దేవరాజులు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి రాక

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి వివిధ కార్యక్రమాల్లో పాల్గొడానికి సోమవారం జిల్లాకు వస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రి రాయచోటి నుంచి రోడ్డు మార్గాన బయల్దేరి ఉదయం 6.30 గంటలకు చౌడేపల్లె మండలం బోయకొడ గ్రామానికి చేరుకుంటారు. అక్కడ జరిగే యోగాంధ్ర - 2025 కార్యక్రమంలో పాల్గొంటారు. 8 గంటలకు బయల్దేరి చిత్తూరుకు చేరుకుని అతిథిగృహంలో బసచేస్తారు. 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో జరిగే షైనింగ్ స్టార్స్ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొంటారు. అనంతరం రోడ్డు మార్గాన బయల్దేరి రాయచోటికి వెళ్తారని కలెక్టర్ ఆ ప్రకటనలో వివరించారు.

భక్తులతో పోటెత్తిన బోయకొండ

● అమ్మవారిని దర్శించుకున్న 20వేల మంది ● సేవా టిక్కెట్లతో ఒక్కరోజులో రూ.11.5 లక్షల ఆదాయం



ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆదివారం భక్తులతో పోటెత్తింది. వేకువజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృతాభిషేకాలు నిర్వహించాక భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గంటల సమయం క్యూలైన్లలో వేచియుండి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు క్యూలైన్లలో రద్దీ కొనసాగింది. సుమారు 20వేల మంది అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. వివిధ సేవా టిక్కెట్ల ద్వారా ఒక్కరోజులో రూ.11.5 లక్షల ఆదాయం సమకూరింది. ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచియున్న భక్తులు

48 ఎర్రచందనం దుంగల స్వాధీనం

● నలుగురు స్మగ్లర్ల అరెస్టు



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా తంబళపల్లె అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు తనిఖీలు నిర్వహించి నలుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి, 48 ఎర్రచందనం దుంగలతోపాటు ఓ మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ చిరంజీవులకు చెందిన ఆర్ఎస్ఐ మురళీధర్‌రెడ్డి బృందం స్థానిక అటవీశాఖ అధికారులు జయప్రసాద్ రావు, మోహన్‌రెడ్డి, షబీన్ తాజ్‌లతో కలిసి తంబళ్లపల్లె పరిధిలోని బురకాయలకోట అటవీ ప్రాంతంలోని వేపూరికోట ఫారెస్టు బీటులో శనివారం తనిఖీలు చేపట్టారు. ఆదివారం తెల్లవారుజామున అన్నగారి పల్లె సమీపంలోని వంకగుట్టు వద్దకు చేరుకోగా అనుమానాస్పదంగా ఓ మోటారు సైకిల్ కనిపించింది. దాన్ని పరిశీలిస్తుండగా అప్పటికే ఆ ప్రాంతంలో ఉన్న స్మగ్లర్లను గమనించారు. పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి నలుగురిని పట్టుకోగలిగారు. ఆ ప్రాంతంలో తనిఖీ చేయగా 48 ఎర్రచందనం దుంగలు లభించాయి. పట్టుబడ్డ స్మగ్లర్లు అన్నమయ్య జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు. స్మగ్లర్లతోపాటు ఎర్రచందనం దుంగలు, మోటార్ సైకిల్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ రహదారిలో భారీ పగుళ్లు



గంటావూరు సమీపంలోని బైపాస్ రోడ్డుపై ఏర్పడిన పగుళ్లు

పలమనేరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలో గంటావూరు ఫ్లైఓవర్ సమీపంలో జాతయ రహదారిలో నడిరోడ్డుపై భారీ పగుళ్లు ఏర్పడింది. బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిలో చిత్తూరునుంచి కర్ణాటక బార్డర్ వరకు సీసీరోడ్డు వేశారు. ఈ సీసీ రోడ్డు నాణ్యత లేక ఇప్పటికే పలుచోట్ల దెబ్బతినడంతో కాంట్రాక్టరు మరమ్మతులు చేసి దానిపై బీటీరోడ్డు వేశారు. నిత్యం దాదాపు 40వేల వాహనాలు వెళ్లే ఈ జాతీయ రహదారిలో నడిరోడ్డుపై ఏర్పడిన భారీ పగుళ్లు ఆ శాఖ అధికారులు గుర్తించక పోవడం దారుణం. ఏదైనా ప్రమాదాలు జరిగితేగాని పట్టించుకోరా అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ఈ రహదారిలో నడిరోడ్డుపై ఏర్పడిన పగుళ్లకు మరమ్మతులు చేయాలని స్థానికులు కూడా కోరుతున్నారు.

నేడు బోయకొండలో యోగాంధ్ర



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా టూరిజం అధికారి గౌరి, ఆర్డీవో భవాని

చౌడేపల్లె, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో ఈనెల 9న జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా టూరిజం అధికారి గౌరి, ఆర్డీవో భవాని తెలిపారు. ఆదివారం బోయకొండ గాలిగోపురం వద్ద యోగాంధ్ర నిర్వహణ ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంత చందోల్, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. మండల స్థాయి అధికారులు, ఉపాధి సిబ్బంది, డ్వాక్రా సంఘ సభ్యులు విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, యువత పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీవో లీలామాధవి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంపై ఆదివారం పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి సమీపంలోని మామిడితోటలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు మునికృష్ణమనాయుడు, సీనియర్ టీడీపీ నాయకులు గోపినాయుడు మాట్లాడుతూ మామిడి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్న తరుణంలో ప్రభుత్వం తోతాపురి పంటకు గిట్టుబాటు ధరను ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు. తోతాపురి మామిడికాయలను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకురాకపోవడంతో రైతులు నిరాశతో ఉన్న సమయంలో సీఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వం కిలో రూ.12 ధరగా నిర్ణయించడంతో రైతుల ఆనందంగా ఉన్నారన్నారు. టీడీపీ నాయకులు గోపినాయుడు, శంకర్, దేవ, తేజ, కిషోర్, లోకేష్, సుదర్శన్‌నాయుడు, పురుషోత్తంనాయుడు, సుబ్బరాజునాయుడు, మునిరత్నంనాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీ మండల ఉపాధ్యక్షుడికి పరామర్శ





నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, చల్లా రామచంద్రారెడ్డి

చౌడేపల్లె, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల ఉపాధ్యక్షుడు ఆవుల రామచంద్ర సతీమణి మునిరత్నమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి చేరుకుని మునిరత్నమ్మ పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రామచంద్ర కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు రమేష్‌రెడ్డి, బోయకొండ మాజీ కమిటీ సభ్యులు శ్రీనివాసులనాయుడు, నాయకులు లక్ష్మీపతిరాజు, ప్రదీప్‌రాజు, మాజీ ఎంపీపీ రెడ్డిప్రకాష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరవుభత్యం బకాయిలు చెల్లించాలి



డీఏ బకాయిలు చెల్లించాలని నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

పలమనేరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గత 5 సంవత్సరాలుగా పెన్షనర్లకు చెల్లించని 8 విడతల కరవు భత్యం బకాయిలు వెంటనే చెల్లించాలని పలమనేరు పెన్షనర్లు డిమాండు చేశారు. పలమనేరు నార్త్ పాఠశాల ఆవరణలో ఆదివారం జరిగిన పెన్షనర్ల సంఘ సమావేశంలో సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గురురాజారావు మాట్లాడార. గత వైసీపీ ప్రభుత్వం కరవు భత్యం 8 విడతలు చెల్లించలేదని, ప్రస్తుత ప్రభుత్వం స్పందించి పెన్షనర్లకు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ నాయకులు గౌస్, కృష్ణమూర్తి, ఆర్ముగం, షన్ముగం, మోహన్, గౌడు, మస్తాన్, బాలసుబ్రహ్మణ్యం, మాలతి, నాగభూషణం, రెడ్డెమ్మ, చంద్రశేఖర్, జగదీష్, అక్బర్‌బాషా, సుబ్రమణ్యంరెడ్డి, పురుషోత్తం, భద్రమ్మ, గోవిందయ్య గురుస్వామి నాయుడు,గుణశేఖర్, మధు, రామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వేడి నీరు పడి కార్మికుడికి గాయాలు

పుంగనూరు రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు వేడి నీరు పడి హంద్రీ-నీవా పనులు చేస్తున్న రేపల్లె కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడి కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా రేపల్లెకు చెందిన కురమయ్య కుమారుడు మధు(23) పుంగనూరు మండలం కంగానెల్లూరు వద్ద జరుగుతున్న హంద్రీనీవా పనుల్లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఉదయం స్నానానికి వేడి నీటిని తీసుకెళుతుండగా ప్రమాదవశాత్తు ఒంటిపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

కంటి శస్త్రచికిత్సలకు 15 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న పీఈఎస్ వైద్యులు

పుంగనూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 15 మంది ఆపరేషన్లకు ఎంపికైనట్లు జిల్లా ప్రాజెక్టు చైర్మన్ డాక్టర్ శివ తెలిపారు. ఆదివారం స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో కుప్పం పీఈఎస్ ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కుప్పంలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల రెండో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ముత్యాలు, త్రిమూర్తిరెడ్డి, ఇనాయితుల్లా, రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనశుద్ధి తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో హరిప్రసాద్

కల్లూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వేరుశనగలో విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్ తెలిపారు. పులిచెర్ల మండలం వెంకటదాసరపల్లి రైతు భరోసా కేంద్రంలో ఆదివారం కలికిరి కేవీకే సమన్వయకర్త డాక్టర్ మంజుల ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను అవలంబిస్తే అధిక దిగుబడులు సాధ్యమవుతాయన్నారు. వరి, వేరుశనగ పంట సాగులో శాస్త్రవేత్తల సూచనలు పాటించాలన్నారు. భూసార పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కేవీకే శాస్త్రవేత్త పీరూ సాహెబ్, రైతులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సదుం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో మానవత సంస్థ పీలేరు శాఖ ఆదివారం సదుంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో జరిగిన శిబిరానికి 150 మంది హాజరుకాగా.. వారిలో 63 మందిని శస్త్రచికిత్సలకు వైద్యులు ఎంపిక చేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ రామచంద్ర, వైద్యులు స్ఫూర్తి, సింధు, గౌరీ శంకర్ కుమార్, సదుం ఉన్నత పాఠశాల హెచ్ఎం జయకుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు అమరనాథరెడ్డి, మానవత సభ్యులు ప్యారూఖాన్, గఫార్ సాహెబ్, శ్రీకాంత్ రెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



అయ్యప్పగానిపల్లెలో ప్రచారం చేస్తున్న సభ్యులు

రామకుప్పం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి కుప్పం సభ్యులు ఆదివారం రామకుప్పం మండలం బైపరెడ్లపల్లె, అయ్యప్పగానిపల్లె, బందార్లపల్లె గ్రామాల్లో త్రైతసిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కృష్ణ, దేవరాజు, శరవణ, కృష్ణమూర్తి, శివకృష్ణ, రితీష్‌కుమార్, రాకేష్, చరణ్, దిలీప్, వెంకటలక్ష్మీ, జలజాక్షి, వాణి, కళ్యాణి పాల్గొన్నారు.

గ్రామాల్లో క్రీడలు ప్రోత్సహించడమే జనసేన లక్ష్యం



సుగాలిమిట్ట వద్ద క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

పుంగనూరు రూరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో యువతలో క్రీడా నైపుణ్యతను పెంపొందిస్తూ ప్రోత్సహించడమే జనసేన పార్టీ లక్ష్యమని ఆదివారం ఆ పార్టీ నాయకుడు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. పుంగనూరు మండలం సుగాలిమిట్ట వద్ద శనివారం నుంచి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో తాండాల్లోని యువకులు, జనసేన నాయకులు విరూపాక్షి, శివకుమార్‌రెడ్డి, బాలాజీనాయక్, హరినాయక్, నాగరాజనాయక్, పవన్‌కుమార్‌నాయక్, పవన్‌కుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు



రామకుప్పం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని జనసేన కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేష్, జిల్లా కార్యదర్శి రామ్మూర్తి, రామకుప్పం మండల అధ్యక్షుడు హరీష్ తెలిపారు. ఆదివారం రామకుప్పంలో ఆ పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్లను కార్యకర్తలకు అందజేశారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోవడమే కాకుండా, అరాచకాలు, అవినీతి రాజ్యమేలిందన్నారు. నేతలు సుభాష్, చంద్రు, హంసగిరి, పాండు, చంద్రశేఖర్, రఘురాం, పవన్, శ్రీకాంత్, కాశీ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ... సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

● 200 ఏళ్లనాటి భవనంలోనే నిర్వహణ ● పెచ్చులూడుతున్న గోడలు ● వర్షానికి ఉరుస్తుండటంతో రికార్డులకు అభద్రత ● పట్టించుకోని అధికారులు



పలమనేరులోని పురాతన భవనంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

పలమనేరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నేటికీ తెల్లదొరలు నిర్మించిన పురాతన చిన్న భవనంలోనే తలదాచుకొంటోంది. పలమనేరులో బ్రిటీష్ హయాంలో తహసీల్దార్ కార్యాలయం, పోలీసు స్టేషన్, సబ్‌జైలు, సబ్‌కోర్టు, సబ్‌ట్రెజరీ కార్యాలయాలు ఒకే భవనంలో ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి పక్కనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి సైతం చిన్న భవనం నిర్మించారు. అయితే ఈ భవనాలు నిర్మించి దాదాపు 200 ఏళ్లు కావస్తుండటంతో సరైన నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకొంటున్న నేపథ్యంలో పోలీసుస్టేషన్‌కు, తహసీల్దారు కార్యాలయానికి నూతన భవనాలు నిర్మించారు. అయితే సబ్‌ట్రెజరీ కార్యాలయం కోసం స్థలం కేటాయించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో గత్యంతరం లేక సబ్ ట్రెజరీ కార్యాలయం కూడా మూడేళ్ల క్రితం అద్దె భవనంలోకి మారిపోయింది. ఇక సబ్ జైలు పరిస్థితి సైతం అదే పరిస్థితి. పెరిగిన కాలానుగుణంగా సమాజంలో నేరప్రవృత్తి పెరిగిపోవడంతో నేరస్థులను ఖైదీ చేసేందుకు పలమనేరు సబ్ జైలు భవనం మూతపడింది. గత 15 సంవత్సరాలుగా కొత్త సబ్‌జైలు నిర్మాణానికి జైళ్లశాఖ నిధులు మంజూరు చేసినా జైలు నిర్మించేందుకు అనువైన అవసరమైన స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించక పోవడంతో జైళ్ల శాఖ మూతపడిన జైలు స్థలంలో ఐవోసీ పెట్రోలు బంకు నిర్వహణకు మాత్రం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం భవనం కేవలం 1000 చదరపు అడుగుల లోపే ఉన్న పురాతన భవనంలోనే నేటికీ తలదాచుకుంటోంది. ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు ఆదాయాన్ని తీసుకొస్తున్న ఈ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించాలన్న ఆలోచన ప్రభుత్వానికి గాని ఇక్కడి నేతలకు గాని లేదు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం గురించి పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఈ భవనం అక్కడక్కడా పెచ్చులూడి వర్షాలకు ఉరుస్తోంది. దీంతో ఈ కార్యాలయంలోని వందల సంవత్సరాల రికార్డులు ఎక్కడ తడిసి పాడైపోతాయోనని, ఈ భవనం పైకప్పు ఎక్కడ కూలిపోతుందో అని అధికారులు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఈ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి నూతన భవనం నిర్మించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

కేఎస్ఆర్, కృష్ణంరాజులను అరెస్టు చేయాలి



కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు



పుంగనూరు సీఐకి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అమరావతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆదివారం కల్లూరు పోలీస్‌స్టేషన్‌లో తెలుగు మహిళలు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తెలుగు మహిళలు మిలాజున్, స్వర్ణలత, రజని మాట్లాడుతూ అమరావతి రాజధాని కోసం 34 వేల ఎకరాలను ఉచితంగా ఇచ్చిన రైతుల భార్యలను కించపరిచే విధంగా మాట్లాడటం దుర్మార్గమన్నారు. టీడీపీ నాయకులు ముల్లంగి వెంకట రమణ, ధనంజయనాయుడు, బీజేపీ నాయకులు పార్థసారధి, మహిళలు పాల్గొన్నారు.

పుంగనూరు: అమరావతిని వేశ్యల రాజధాని అంటూ ప్రసారం చేసిన ఛానల్‌ను మూసివేయాలని పుంగనూరు టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐ సుబ్బరాయుడుకు తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు కవిత, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మాధవరెడ్డి తదితరులు ఫిర్యాదు చేశారు. కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమైనవన్నారు. అమరావతి ప్రాంత మహిళలను అవమానపరిచేలా సాక్షి టీవీలో ప్రసారం చేయడం దారుణమని వాపోయారు. వెంటనే వారిని అరెస్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంగాధర్, సుబ్రహ్మణ్యం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మంగళంపేటలో ఒక్కటైన పూర్వ విద్యార్థులు

కల్లూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం మంగళంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో 1993-94 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అప్పటి ఉపాధ్యాయులు అబ్దుల్ మునాఫ్, యర్రయ్య, చక్రధర్, రామనాథన్, విజయకుమార్, రామకృష్ణ, హరినాథ్, శివశంకర్‌నాయుడు, ఆనందనాయుడు, దేవేంద్రరెడ్డిలను ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రామకుప్పంలో యోగాంధ్ర ర్యాలీ

రామకుప్పం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలో సోమవారం యోగాంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ఎంపీడీవో కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమై పురవీధుల్లో కొనసాగుతుందన్నారు. ర్యాలీలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు, గ్రామపెద్దలు, యువత హాజరు కావాలని ఆయన కోరారు.

దీపం-2 గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

రామకుప్పం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలోని దీపం-2 పథకం లబ్ధిదారులకు సోమవారం గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేయనున్నట్లు టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో లబ్ధిదారులతోపాటు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొనాలని కోరారు.

షైనింగ్ స్టార్ అవార్డులకు విద్యార్థుల ఎంపిక

సోమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నుంచి పలువురు విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపికైనట్లు ఎంఈవో శివరత్న తెలిపారు. సోమల ఉన్నత పాఠశాలకు చెందిన వంశీ సాయి, నంజంపేటలో బిందుప్రియ, కందూరులో రేవతి, దీపక్, పెద్దఉప్పరపల్లెలో యోగేశ్వర, భానుప్రకాశ్ అవార్డులకు ఎంపికయ్యారు.

ఆవులపల్లెలో గంగజాతర వేడుకలు

సోమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):ఆవులపల్లె పంచాయతీలో గంగజాతర వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. గ్రామ పొలిమేర్లలోని మారెమ్మ, తిరుపతి గంగమ్మ, విరూపాక్షమ్మ, పోలేరమ్మ ఆలయాల వద్దకు మహిళలు ప్రదర్శనగా వెళ్లి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు.

శాస్త్రోక్తంగా సుభద్ర కల్యాణం

సోమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం భారతంమిట్టలో మహాభారత యజ్ఞం సందర్భంగా ఆదివారం సుభద్ర కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిపారు. ఈక్రమంలోనే ఉభయదారులు శెట్టివారి అశోక్ కుమార్ దంపతులు పంచపాండవ విగ్రహాలకు అభిషేక పూజలు చేశారు. ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కల్యాణ మండపంలో కల్యాణోత్సవం నిర్వహించారు. భాగవతారణి నాగరత్న కల్యాణ ఘట్టాలను భక్తులకు వివరించారు. రాత్రి నాటక మండలి సభ్యులు నాటక ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి ఆలయంలో పూజలు నిర్వహించారు.


బసవరాజుకండ్రిగలో...

పెద్దపంజాణి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసవరాజుకండ్రిగలో గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన జాతరలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు మురహరిరెడ్డి, చలపతి, భానుప్రతాప్‌రెడ్డి, రామకృష్ణ, గంగప్ప, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

అన్నదానం చేపట్టారు. సాయంత్రం ఇళ్ల వద్దకు చేరుకొని పొంగళ్ల వండి నడివీధి గంగమ్మకు పూజలు నిర్వహించారు.

నెల్లిపట్లలో ఘనంగా గంగజాతర



గంగమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : బైరెడ్డిపల్లి మండలం నెల్లిపట్ల గ్రామంలో ఆదివారం గంగమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ జాతరలో పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అమరనాథరెడ్డిని శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బైరెడ్డిపల్లి మండల టీడీపీ అధ్యక్షులు కిషోర్‌గౌడు, టీడీపీ నాయకులు రమేష్‌రెడ్డి, విల్వనాథం, జయన్న, గోవర్ధన్, లోకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దఉప్పరపల్లెలో వలసదేవర్లు



పెద్దఉప్పరపల్లెలో తట్టాబుట్టలతో వలసపోతున్న గ్రామస్తులు

సోమల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దఉప్పరపల్లె గ్రామస్తులు ఆదివారం వలసదేవర్లు కోలాహలంగా జరుపుకున్నారు. పెద్దఉప్పరపల్లె గంగజాతర నేపథ్యంలో ముందస్తుగా వలస దేవర్లు నిర్వహించడం ఆనవాయితీ. ఈనెల 15, 16 తేదీలలో గంగజాతర జరుపుకోనున్నారు. ఈక్రమంలోనే గ్రామస్తులు గ్రామాన్ని ఉదయం 6 గంటలకు వదిలి ఇంటి నుంచి తట్టబుట్టలతో పశువులతో కలిసి పొలిమేర్లకు కదలి వెళ్లారు. ఇళ్లకు తాళాలు వేశారు. తళారులు గ్రామంలో కాపుగా ఉన్నారు. పొలాల వద్ద అమ్మవార్లను ప్రతిష్ఠించి పొంగళ్లు పెట్టి పూజలు నిర్వహించారు. చెక్కభజనలు, కోలాటాలతో గడిపారు.

కోదండరాముడికి చల్లా పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లి పంచాయతీ యల్లంపల్లిలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయం మహా కుంభాభిషేకం వేడుకల్లో ఆదివారం పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా యల్లంపల్లికి విచ్చేసిన ఆయనకు గ్రామస్తులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ చల్లా రామచంద్రారెడ్డిని ఆలయంలోకి తీసుకెళ్లారు. స్వామివారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించిన అనంతరం చల్లాకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర కురబ కార్పోరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, కుమార్‌రెడ్డి, ధనంజయనాయుడు, సురేష్, నాగరాజనాయుడు, చెన్నుపాటి ధన, చెంగల్రాయనాయుడు,సుబ్రహ్మణ్యంనాయుడు, శ్రీనివాసులు, గోపాల్‌రాజు, శ్రీరాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కలిసి మెలిసి పనిచేయండి

● ఎమ్మెల్యే భానుప్రకాష్



టీడీపీ నగరి మండల అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): విభేదాలు వీడి అందరూ కలిసి మెలిసి పని చేసి అభివృద్ధికి దోహదపడాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పిలుపునిచ్చారు. టీడీపీ నగరి మండల కమిటీ అధ్యక్షుడిగా జవహర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా వేణు ఎంపిక కావడంతో ఆదివారం నగరి పార్టీ కార్యాలయంలో వారికి సన్మానసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో అధ్యక్షుడిగా శివకుమార్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా పురుషోత్తం నాయుడు పార్టీకి ఎనలేని సేవచేశారని అన్నారు. నూతనంగా ఎంపికైన అధ్యక్ష, కార్యదర్శులకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గ్రూపు రాజకీయాలు చేస్తే సహించేదిలేదని, పార్టీకోసం కృషి చేసే వారికి అండగా నిలుస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, రాష్ట్ర టీడీపీ మహిళా అధికారప్రతినిధి మీరాకుమారి, దేశమ్మగుడి మాజీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, రాష్ట్ర కాపు వన్నెకుల క్షత్రియ సంఘం డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, ఉమాపతిరాజు, నారాయణస్వామి నాయుడు, చిత్తూరు బాబు నాయుడు, పరందామ నాయుడు, నాగరాజు, గోవిందస్వామి, ప్రకాష్ నాయుడు, దేవరాజులు, వినోద్, మునికృష్ణ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ద్రౌపదీ దేవి కల్యాణం



ద్రౌపది అమ్మవారి కల్యాణోత్సవం, హాజరైన భక్తులు

వెదురుకుప్పం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం కొల్లాగుంటలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ద్రౌపది అమ్మవారి కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ముందుగా అమ్మవారి ఆలయంలో ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. తర్వాత శాస్త్రోక్తంగా వేదపండితులు కల్యాణోత్సవం చేశారు. ఏర్పాట్లను కార్యనిర్వాహకులు పర్యవేక్షించారు.



ద్రౌపదీ కల్యాణోత్సవం

● శ్రీరంగరాజపురం, (ఆంధ్రజ్యోతి): మహాభారతం ఉత్సవాల్లో భాగంగా ఎస్‌ఆర్‌పురం మండలం కేంద్రంలో ద్రౌపదీ కల్యాణోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉభయదారులుగా కుమారి, ఎత్తిరాజులు నాయుడు, స్వాతి ప్రకాష్ వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త వేణు నాయుడు, నారాయణస్వామి నాయుడు, గంధమనేని రాజశేఖర్ నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, కేశవులు నాయుడు, రమేష్ నాయుడు, ఆంజనేయులు నాయుడు, కుప్పయ్య, మాధవ నాయుడు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

బంగారుపాళ్యం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): చెన్నై శంకర్‌నేత్రాలయం వారి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మురళీకృష్ణ తెలిపారు. కంటి సమస్యలతో బాధపడే రోగులకు అనుభవజ్ఞులైన వైద్యులచే ఉచితంగా పరీక్షలు జరిపి, అవసరమైన వారికి ఆపరేషన్‌లు నిర్వహిస్తామని చెప్పారు.

రాష్ట్ర ప్రజలకు జగన్ క్షమాపణ చెప్పాలి

● మాజీ ఎమ్మెల్సీ దొరబాబు



మీడియాతో మాట్లాడుతున్న దొరబాబు

చిత్తూరు సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు మాజీ సీఎం జగన్ క్షమాపణ చెప్పాలని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు డిమాండ్ చేశారు. స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కుంభకోణాల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి జగన్ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. రాజధాని అమరావతిపై దుష్ప్రచారం చేయించినందుకు, మహిళల శీల హననం చేయించినందుకు, అమరావతిలో అధికంగా ఉన్న బీసీ, ఎస్సీలను అవమానించినందుకు, ప్రముఖ బౌద్ధ క్షేత్రంపై దాడి చేయించినందుకు జగన్ రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. సాక్షి డిబేట్‌లో జర్నలిస్టుల ముసుగులో ఉన్న సంస్కార హీనులు, కిరాయి బ్యాచ్.. మహిళలను కించపరుస్తూ ఆంధ్రుల కలల రాజధాని అమరావతిని వేశ్యల రాజధాని అని అత్యంత నీచపు వాఖ్యలు చేశారని.. ఇది రాష్ట్ర మహిళల వ్యక్తిత్వంపై దాడి అన్నారు. వైసీపీని ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా ఇంకా బుద్ధి రాలేదని అన్నారు. జర్నలిస్టులు కేఎస్ఆర్, కృష్ణంరాజుతో పాటు భారతిరెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు మోహన్ రాజ్, వెంకటేష్ యాదవ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీల్లో 40 కేసుల నమోదు

చిత్తూరు సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వాహనాల తనిఖీల్లో 40 కేసులు నమోదుచేసినట్లు వన్‌టౌన్ సీఐ మహేష్ తెలిపారు. ఆదివారం నగరంలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 10 మందిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే వాహనాలు నడుపుతున్న మైనర్లను, సరైన పత్రాలులేని వాహనాలను గుర్తించి 30 కేసులు నమోదుచేసినట్లు చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

చెట్టు కూలి విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిత్తూరు కల్చరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): శనివారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి గిరింపేట దుర్గానగర్ కాలనీలో చెట్టుకూలి తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాకు తీవ్రఅంతరాయం ఏర్పడింది. దీంతో దుర్గానగర్‌కాలనీ, ప్రశాంత్ నగర్, రోసి నగర్, గిరింపేట, శివాజి నగర్, సిద్ధార్థ నగర్, ఓటి చెరువు, కృష్ణానగర్ కాలనీలలో సుమారు గంటన్నర పాటు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. స్థానికులు ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆ శాఖ సిబ్బంది కూలిన వృక్షాన్ని తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

వీధి దీపాలు వెలిగించరా?

వెదురుకుప్పం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగు కాలనీలో రెండు నెలలుగా వీధి దీపాలు వెలగకుండా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆ గ్రామస్తులు ఆదివారం తెలిపారు. ఈ విషయాన్ని క్షేత్రస్థాయి ఉద్యోగుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని తెలిపారు. కాలనీ ప్రజలే కదా అని వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. వీధి దీపాలు వెలగక రాత్రుల్లో విషపురుగుల బెడదతో భయాందోళనతో కాలం వెళ్లదీస్తున్నామని తెలిపారు. ఎందుకీ వివక్ష.. స్పందించి వీధి దీపాలు వెలిగించకపోతే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన వారిపై

కేసులు నమోదుచేయాలి: టీడీపీ





నగరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు, యాదమరి మండలం జోడిచింతల వద్ద జర్నలిస్టు కృష్ణంరాజు దిష్టిబొమ్మను, సాక్షి పత్రిక ప్రతులను దహనం చేస్తున్న తెలుగు మహిళలు

నగరి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన సాక్షి ప్రతినిధి కొమ్మినేని శ్రీనివాసరావు, విశ్లేషకుడు కృష్ణంరాజులపై కేసు నమోదు చేయాలని నగరి పోలీస్‌స్టేషన్‌లో టీడీపీ నాయకులు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతిని వేశ్యల రాజధాని అంటూ మహిళలను కించపరిచేలా మాట్లాడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. నగరి పట్టణ టీడీపీ అధ్యక్షులు రమేష్‌బాబు, కార్యదర్శి శ్రీనివాసన్, రాష్ట్ర టీడీపీ మహిళా అధికారప్రతినిధి మీరా, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, నాయకులు కృష్ణారెడ్డి, గుణశేఖర్, జ్యోతినాయుడు, ఎం.వి.శ్రీనివాసులు, జవహర్‌రెడ్డి, వేణు, మాణిక్యవాసన్, మదివణ్ణన్, చిట్టి, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు కృష్ణంరాజు దిష్టిబొమ్మ దహనం

యాదమరి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పూతలపట్టు తెలుగు మహిళ అధ్యక్షులు ములగూరి లత, యాదమరి అధ్యక్షులు చిత్రా నాయుడు, ఐదు మండలాల తెలుగు మహిళ అధ్యక్షులు, మహిళా కార్యకర్తలతో కలసి యాదమరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే మురళీమోహన్ ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం జోడిచింతల వద్ద నియోజకవర్గం నుంచి వచ్చిన మహిళా కార్యకర్తలతో కలిసి రాజధాని ప్రాంత మహిళల పట్ల సాక్షిలో ప్రచురితమైన అనుచిత వ్యాఖ్యలను తప్పుపట్టారు. జర్నలిస్టు కృష్ణంరాజు దిష్టిబొమ్మ, సాక్షి పత్రిక ప్రతులను దహనం చేశారు. అనంతరం యాదమరి పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్ కృష్ణమూర్తికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బంగారుపాళ్యం, యాదమరి, ఐరాల, తవణంపల్లి మహిళా అధ్యక్షులు రాధిక, చిత్రా నాయుడు, స్వర్ణ, చిట్టెమ్మ, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్ భారతిని అరెస్టు చేయాలి

గుడిపాల, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతి మహిళలను వేశ్యల రాజధాని అని కించపరుస్తూ ప్రసారం చేసిన సాక్షి చానల్ ఎండీ వైఎస్ భారతిని అరెస్టు చేయాలని మండల టీడీపీ సీనియర్ నాయకుడు బాలాజీ నాయుడు, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు, మాజీ ఎంపీపీ నాగరాజ్‌యాదవ్ అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ సాక్షి చానల్‌లో జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు అసభ్యకరంగా మాట్లాడటం దారుణమన్నారు. ఇంత మంది మహిళలను కించపరిచిన వారిని మాజీ ముఖ్యమంత్రి జగన్ ఏమి అనకపోవడం శోచనీయమన్నారు. అమరావతి మహిలలను కించపరచిన వారిని అరెస్టు చేయకపోతే రోడ్డెక్కుతామని వారు హెచ్చరించారు.

అలరించిన దుర్యోధన వధ



భీముడు, దుర్యోధనుడు యుద్ధ సన్నివేశం

శ్రీరంగరాజపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురం మండలం చిల్లామాకుపల్లె ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ ఆవరణలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన దుర్యోధన వధ కార్యక్రమం అలరించింది. భీముడు, దుర్యోధనుడి పాత్రధారుల యుద్ధ సన్నివేశాన్ని పద్యాల రూపంలో పాడి ఆకట్టుకున్నారు. ఆలయంలో ద్రౌపదీ, పాండవుల విగ్రహాలకు పూజలు నిర్వహించి, పొంగళ్లు పెట్టారు. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశాన్ని నిర్వహించారు. అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. వేడుకలను తిలకించడానికి అధికసంఖ్యలో భక్తులు విచ్చేశారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, శీనయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

● గంగాధరనెల్లూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లేపల్లెలో దుర్యోధనవధ ఘట్టం పలువురిని అలరించింది. మహాభారతం వార్షికోత్సవంలో భాగంగా 17వరోజు ఆదివారం ఉదయం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో



యుద్ధ ఘట్టంలో తలపడుతున్న దుర్యోధనుడు, భీముడు పాత్రధారులు

ప్రత్యేకపూజలు చేశారు. ఉత్సవమూర్తులైన ద్రౌపదితో పాటు పాండవుల విగ్రహాలను ఆలయం నుంచి మట్టితో తయారుచేసిన దుర్యోధనుడి ప్రతిమవద్దకు తీసుకొచ్చారు. భీముడు, దుర్యోధనుడు పాత్రధారులు తలపడిన యుద్ధ సన్నివేశాల్లో దుర్యోధనుడి వధతో ఆ ఘట్టం ముగిసింది. పెద్దమిట్టపల్లెకు చెందిన కె.దామోదర్‌రెడ్డితో పాటు కుటుంబసభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయం ముందు ఆదివారం సాయంత్రం ఏర్పాటుచేసిన అగ్నిగుండంలో భక్తులు నడిచి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో నిర్వాహకులు ప్రసాద్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, వెంకటరెడ్డి, గంగయ్యయాదవ్, జయరామిరెడ్డి, యుగంధర్‌రెడ్డి, గుంటూరు దేవరాజులునాయుడు, పుష్పరాజ్, శ్రీధర్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అవగాహనతోనే పంటలలో అధిక దిగుబడి

గుడిపాల, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అవగాహనతోనే పంటలలో అధిక దిగుబడి సాధించవచ్చునని శాస్త్రవేత్త దేవిక అన్నారు. ఆదివారం వసంతాపురం గ్రామ సచివాలయంలో ఆర్ఎస్కేలో కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త మంజుల పర్యవేక్షణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యాన పంటలలో సమగ్ర సంపూర్ణ రక్షణ గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ సంధ్య మాట్లాడుతూ చిరుధాన్యాల పంటలలో సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త సోమశేఖర్‌బాబు, మండల వ్యవసాయ అధికారి మాధవి, పశువైద్యాధికారి సాయిసుధా, వైద్య సేవా సంఘ సభ్యులు, విస్తరణాధికారులు పాల్గొన్నారు.

ఘనంగా వీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

పూతలపట్టు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రచెరువుపల్లి దళితవాడలో వీరాంజనేయస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామివారి విగ్రహానికి అభిషేకాలు, పూజలు, శాంతి హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ మహోత్సవాలు మూడురోజుల పాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

బలిజలను బీసీలుగా గుర్తించాలి

చిత్తూరు సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బలిజలను బీసీలుగా గుర్తించాలని ఏపీ బలిజ, కాపు, తెలగ, ఒంటరి కులాల బీసీ రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షుడు ప్రసాద్ కోరారు. ఆదివారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలోని కృష్ణదేవరాయ విగ్రహం నుంచి రాజధాని అమరావతి వరకు పాదయాత్ర ప్రారంభించారు. ప్రసాద్ మాట్లాడుతూ అన్నిరంగాల్లో వెనుకబడిన బలిజలను బీసీలుగా గుర్తించాలని కోరారు. తరతరాలుగా బలిజలకు రాజకీయాల్లో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బలిజలను బీసీలుగా గుర్తించేవరకు తన పోరాటం కొనసాగిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా బలిజలను బీసీలుగా గుర్తించాలని పోస్టర్‌లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బలిజ సంఘం నేతలు ఓఎం రామదాస్, శేఖర్, ఆరణి తులసీరామ్, కడియాల వరదరాజులు, రామూర్తి, విశ్వనాథ్, నరసింహులు, బాలాజి తదితరులు పాల్గొన్నారు.



బలిజలను బీసీలుగా గుర్తించాలని పోస్టర్ చూపుతున్న ఆ సంఘం నేతలు

అట్టహాసంగా బండి కుంభాలు



పచ్చికాపల్లం మహాభారత ఉత్సవాల్లో భాగంగా బకాసురుడికి కుంభం తీసుకెళుతున్న నిర్వాహకులు

వెదురుకుప్పం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బకాసురుడికి బండి కుంభాల కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. మహాభారత ఉత్సవాల పరిధిలో ఉన్న పలు గ్రామాల నుంచి మేళతాళాలు, బాణసంచా పేల్చుతూ కేరింతలు కొడుతూ బండి కుంభాలు తీసుకొచ్చారు. అనంతరం సంప్రదాయబద్ధంగా ఆలయం వద్దకు చేరుకుని బండి కుంభం వేశారు. నైవేద్యం సమర్పించారు. కార్యనిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● వెదురుకుప్పం మండలం చెంచుగుడి మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బండి కుంభాల కార్యక్రమాన్ని చేపట్టారు. వేణుగోపాలపురం నుంచి బండి కుంభం తీసుకొచ్చి ఆలయ ఆవరణంలో వేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

బాలిక అదృశ్యం?

వెదురుకుప్పం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక (16) అదృశ్యమైంది. దీంతో బాలిక కుటుంబీకులు ఆదివారం వెదురుకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రదోష కాలం పూజలు



నందీశ్వరుడికి పూజలు

వెదురుకుప్పం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని శిష్ట సౌందర్య వల్లీ సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రదోష కాలం పూజలు చేశారు. స్వామికి అభిషేక పూజలతో పాటు నందీశ్వరుడికి ప్రదోష కాలం పూజలు వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు కోదండపాణి మొదలియార్ సహా నిర్వాహకులు పర్యవేక్షించారు.

నైనేరమ్మ ఆలయంలో వార్షికోత్సవ పూజలు



ప్రత్యేక అలంకరణలో నైనేరమ్మ

వెదురుకుప్పం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం డీఎంపురం పంచాయతీ దేరాకండ్రిగ సమీపంలోని నైనేరమ్మ ఆలయంలో ఆదివారం వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనం కల్పించారు. భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమాల్లో ఆముదాల సుగుణ, చిన్నప్ప, గుత్తి బొబ్బిలి, ప్రకాష్, వెంకటేష్, గోపాల్, మునిసుందరం, భీమయ్య, మురళి, గోపి పాల్గొన్నారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు



గాయపడిన మధు

శ్రీరంగరాజపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బావా బావమరుదుల మధ్య జరిగిన ఘర్షణలో బావమరిది తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు ఎస్‌ఆర్‌పురం మండలం నల్లాపల్లె గ్రామానికి చెంది. బుచ్చిరెడ్డి, మధురెడ్డి బావ బావమరుదులు. వీరికి ఆర్థిక లావాదేవీల మధ్య మనస్పర్థలు ఉన్నాయి. తనకు ఉన్న బాకీ డబ్బులు ఇవ్వాలని మధురెడ్డిని ఆదివారం బుచ్చిరెడ్డి అడగటంతో వారి మధ్య మాట మాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో మధురెడ్డి చిటికెన వేలికి తీవ్రగాయం కావడంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.